సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం। 23। జనవరి। 2025



పర్యావరణాన్ని పరిరక్షించాలి

విద్యార్థులు చదువుకుంటూనే పర్యావరణ పరిరక్షణపై అందరికీ అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. 8లో



గౌరవ వేతనం ఎప్పుడో?

సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 16°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అటవీ సంపదను రక్షిద్దాం

డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్



బేస్‌క్యాంప్ టవర్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ తదితరులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అటవీ సంపదను కాపాడుకుందామని, ఇందుకోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి శివారులోని బ్యాంబో ప్లాంటేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సుమారు 100 హెక్టార్లలో చేపట్టిన వెదురు ప్లాంటేషన్‌ను, బేస్‌క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెదురు ప్లాంటేషన్ కోతకు అనుమతి కోసం ఉన్నతధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని అన్నారు. సిబ్బంది మరింత మెరుగ్గా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య, వీఎస్ఎస్ చైర్మన్ సీహెచ్ రాములు, సభ్యులు వడ్డేపల్లి బాబు, చల్లా లక్ష్మణ్‌రావు, నీలం రాములమ్మ, రుంజా ముత్యం పాల్గొన్నారు.

బుద్ధ గుహలను సందర్శించిన ఫ్రాన్స్ యువతి



ఫ్రాన్స్ యువతి సోలెన్‌కు వివరాలు వెల్లడిస్తున్న కమలారాణి

కొత్తగూడెం రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం గుట్టలపై ఉన్న బుద్ధుడి విగ్రహాలను ఫ్రాన్స్ దేశానికి చెందిన యువతి సోలెన్ బుధవారం సందర్శించారు. ఫ్రాన్స్‌లోని ఇనాల్కో యూనివర్సిటీలో తెలుగు, సంస్కృతం భాషలను నేర్చుకుంటున్న ఆమె హిస్టరీ ఆఫ్ ఆర్ట్స్ కోర్సు చదువుతోంది. ఈనేపథ్యాన పుస్తకాల్లో కారుకొండ రామవరం గుట్టలు, బుద్ధుడి విగ్రహాల సమాచారం తెలుసుకున్న సోలెన్ విజయవాడ మీదుగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు బుద్ధిస్ట్ సొసైటీకి చెందిన కమలారాణి ఇక్కడి చారిత్రక ప్రత్యేకతలను ఆమెకు వివరించారు.

జిల్లా కోర్టులో క్రీడా పోటీలు


కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. లెమన్‌స్పూన్ రన్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఏర్పాటుచేయగా పలువురు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి పాటిల్ వసంత్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఎ.సుచరిత, కె.సాయిశ్రీ, బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు, దూదిపాల రవికుమార్, సాధిక్‌పాషా, గాజుల రామ్మూర్తి, పి.నాగేశ్వరావు, వేల్పుల సుధాకర్, జీకే అన్నపూర్ణ, ఎస్.భానుప్రియ, ఎ.మహాలక్ష్మీ, జి.సునంద, మల్లెల ఉషారాణి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

ఇల్లెందురూరల్ : ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన రొంపేడు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మందుల నిల్వ, ఇన్‌పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్‌సెంటర్ల పనితీరు మెరుగు పడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, వైద్యాధికారులు కవిత, మురళీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.



అభివృద్ధికి రెక్కలు

విమానాశ్రయ స్థల పరిశీలనకు నేడు కేంద్ర బృందం

- 950 ఎకరాల భూమిని గుర్తించిన అధికారులు
- మూడు మండలాల్లో పర్యటించనున్న బృందం సభ్యులు
- సర్వే నిర్వహణకు రూ.36 లక్షలు విడుదల

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలో లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక, పాల్వంచ మండలం బంగారుజాల – గుడిపాడు ప్రాంతాల్లో భూములను పరిశీలించగా ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవి అనుకూలంగా లేవని తేలింది. దీంతో కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను ప్రభుత్వం గుర్తించింది. అయితే కొత్తగూడెంలో సర్వే నిర్వహణకు రూ.36 లక్షలు అవసరమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రిత్వ శాఖ తెలపగా, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఆరుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమించింది. ఇందులో ఏరో ప్లానింగ్ విభాగానికి చెందిన అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్ట్ మహ్మద్ సకీబ్, ప్రశాంత్ గుప్తా, సీఎన్ఎస్ఆర్ దివాకర్(ఆపరేషన్స్), ఇంజనీర్లు మనీష్ జోన్వాల్, ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ ఉన్నారు. వీరు కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో గురువారం పర్యటించి వివరాలు సేకరించనున్నారు.

సర్వేలో సమగ్ర వివరాలు..

విమానాశ్రయ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలంలో గత పదేళ్లగా వాతావరణ (మెటీయోరాలాజికల్) నివేదికలు, విండ్‌రోజ్ డయాగ్రమ్ తదితర సాంకేతిక వివరాలను సర్వేలో సేకరిస్తారు. అంతేకాక ఎత్తయిన కొండలు, నిర్మాణాలతో విమాన రాకపోకలు ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా ? జలవనరులకు ఏమైనా సమస్యలొస్తాయా అనే అంశాలను సైతం పరిశీలిస్తారు. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఆర్థికంగా ఏ మేరకు లాభం ఉంటుంది వంటి వివరాలపైనా ఆరా తీస్తారు. ఈ వివరాల ఆధారంగా ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుంది.

అభివృద్ధికి బాటలు..

జిల్లాలో సింగరేణి బొగ్గు గనులతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలు, హెవీ వాటర్ ప్లాంట్, నవభారత్, ఐటీసీ పేపర్ బోర్డు వంటి పరిశ్రమలు ఉన్నాయి. భద్రాచలం పుణ్యక్షేత్రంతో పాటు పాపికొండలు, మారేడుమిల్లి వంటి ఎకో టూరిజం కేంద్రాలకు జిల్లా గేట్‌వేగా ఉంది. దీంతో వాణిజ్యపరంగా, పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుంది. పర్యాటక రంగంలో ఉపాధికి బాటలు పడతాయి.

950 ఎకరాల స్థలం గుర్తింపు..

కొత్తగూడెంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులో చిన్న విమానాలతో పాటు ఎయిర్ బస్ వంటి భారీ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ తీసుకునేందుకు వీలుగా డిజైన్ చేస్తున్నారు. అందులో భాగంగా మూడు కిలోమీటర్ల పొడవైన రన్‌వే నిర్మించాలని భావిస్తున్నారు. దీంతో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం అటవీ, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు.. మొత్తం 950 ఎకరాలు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పక్కపక్కనే ఉన్న కొత్తగూడెం మండల పరిధిలోని రామవరం, గరీబ్‌పేట శివారులో 707, సుజాతనగర్ మండలంలో 195, చుంచుపల్లి మండలంలో 50 ఎకరాలు గుర్తించారు.

రామవరానికి ఊపిరి



సింగరేణి కార్మికులతో ఒకప్పుడు వెలుగు వెలిగిన రామవరం గడిచిన రెండు దశాబ్దాలుగా ప్రాభవం కోల్పోతోంది. ఇప్పుడు ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే ఈ ప్రాంతానికి మరోసారి జీవం పోసినట్టవుతుంది. జిల్లాలో రామవరం మళ్లీ ప్రాముఖ్యత సంతరించుకుంటుంది.

– అబ్దుల్ బాసిత్, జమాతే ఇస్లామీ హింద్ రామవరం శాఖ అధ్యక్షుడు

ఉపాధి దొరుకుతుంది



బేరియం కెమికల్ ఫ్యాక్టరీ మూతపడటం, డిగ్రీ కళాశాల, లైబ్రరీ, కోర్టు, సబ్‌జైలు రామవరం నుంచి తరలిపోవడంతో స్థానికులకు ఉపాధి కరువైంది. ప్రస్తుతం మాతాశిశు ఆస్పత్రి, రేడియో కేంద్రమే ఇక్కడ మిగిలాయి. ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. – పి.సతీష్, 4 ఇంక్‌లైన్

విమానాశ్రయం అవసరం



జిల్లాలో బొగ్గుగనులతో పాటు మణుగూరులో హెవీ వాటర్ ప్లాంట్, బీటీపీఎస్, పాల్వంచలో నవభారత్, కేటీపీఎస్, సారపాకలో ఐటీసీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రం వంటివి ఉన్నందున ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు ఎంతో అవసరం.

– పిల్లి రాంబాబు, ఎస్‌బీ నగర్

మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి



విమానాశ్రయం ఏర్పాటైతే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. విమానాశ్రయ ఏర్పాటుకు గరీబ్‌పేటలో రైతుల నుంచి భూములు సేకరించినా అభ్యంతరం లేదు. అయితే నిర్వాసిత రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మాకు న్యాయం చేయాలి.

– రాములు, మాజీ సర్పంచ్ గరీబ్‌పేట

పట్టాల సమస్య పరిష్కరిస్తాం



మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్, ఎస్పీ

- సీఎంతో చర్చించి జీఓ 76ను పునరుద్ధరిస్తాం
- ఇల్లెందు అభివృద్ధిని కొనసాగిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

ఇల్లెందు: రాష్ట్రంలో సింగరేణి వ్యాప్తంగా పట్టాల సమస్య ఉందని, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి జీఓ నంబర్ 76ను పునరుద్ధరించడం ద్వారా ఈ సమస్య పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఇల్లెందులో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయాన్ని, పాఖాల రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత రూ.4 కోట్లతో చేపట్టే బుగ్గవాగు సుందరీకరణ పనులకు, 22వ వార్డులో రూ. 2.41 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి, 23వ వార్డులో రూ.1.31 కోట్లతో నిర్మించనున్న పీహెచ్‌సీ పనులకు, రూ.55 లక్షలతో చేపట్టిన మున్సిపల్ గెస్ట్‌హౌస్‌ను పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే మహాలక్ష్మి, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలు అమలు చేస్తుండగా, ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మత ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను సైతం అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఈ విషయంలో ఎవరూ ఆందోళనకు గురికావద్దని అన్నారు. కొందరు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని కోరారు.

మున్సిపల్ పాలకవర్గం సేవలు భేష్..

ఇల్లెందు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఐదేళ్లలో పట్టణాభివృద్ధికి విశేష కృషి చేశారని మంత్రి పొంగులేటి అభినందించారు. మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే టాప్ –5లో ఇల్లెందు నిలవడం విశేషమన్నారు. కేంద్ర రాష్ట్ర అవార్డులతో పాటు పట్టణ సుందరీకరణ దిశగా పరుగులు పెట్టించారని అన్నారు. మరో నాలుగు రోజుల్లో పాలకవర్గ పదవీ కాలం ముగియనుందని, భవిష్యత్‌లోనూ ఈ సభ్యులకే ప్రజల ఆశీస్సులు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలో దొంగల బెడద నివారణకు 24 వార్డుల్లో సీఎస్సార్ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పలు వార్డులకు మిషన్ భగీరథ నీరు రావటం లేదని, ట్యాంకులు అసంపూర్తిగా ఉన్నాయని కౌన్సిలర్ నవీన్ మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే పూర్తి చేయించాలని కమిషనర్ శ్రీకాంత్‌కు సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డీవీ, వైస్ చైర్మన్ జానీపాషాతో పాటు సభ్యులను మంత్రి సత్కరించి మెమెంటో అందజేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఇల్లెందు మున్సిపాలిటీకి దేశ, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ గుర్తింపు రావడానికి పాలకవర్గ సభ్యులతో పాటు వర్కర్ల కృషి చేయడమే కారణమన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం కృషి ఇల్లెందు అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ తాను రాష్ట్రంలో ఓ చోట మున్సిపల్ కమిషనర్‌గా పని చేశానని, ఇల్లెందు మున్సిపాలిటీ ఏనాడు చూసినా అగ్రస్థానంలో ఉండేదని అన్నారు. సమావేశంలో ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎఫ్‌ఓ కృష్టాగౌడ్, ఆర్డీఓ మధు, డీఎంహెచ్‌ఓ భాస్కర్, ఆర్ అండ్‌బీ ఈఈ వడ్లమూడి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాఘవబోయినగూడెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

పల్లె రహదారులను మెరుగుపరుస్తాం

ఇల్లెందురూరల్: ప్రతి పల్లెకు బీటీ రహదారి సౌకర్యాన్ని కల్పిస్తూ అంతర్గత రహదారుల మెరుగుదలకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం ప్రధాన రహదారికి అనుసంధానంగా రాఘబోయినగూడెం వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమంతోపాటు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఇల్లెందు మండలంలో నెలకొన్న సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, ప్రజలకు మంచి జరిగేందుకు అవసరమైన అన్ని పనులూ ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

‘బాలవెలుగు’కు సొంత భవనం

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి హామీ

మణుగూరు టౌన్ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న బాలవెలుగు పాఠశాలకు సొంత భవనం, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కలెక్టర్‌తో మాట్లాడుతానని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి హామీ ఇచ్చారు. బుధవారం ఆమె పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వసతి సౌకర్యం, చదువు, క్రీడల వంటివి ఎలా ఉన్నాయని ఆరా తీశారు. గత 13 ఏళ్లుగా గొత్తికోయలు, గిరిజన బాల కార్మికులను చేరదీసి 1,450 మంది విద్యార్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని పాఠశాల నిర్వాహకులు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరం భానుమతి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ న్యాయవాది నిరంజన్‌రావు, మణుగూరు లీగల్ ఎయిడ్ న్యాయవాది అంకం సర్వేశ్వరరావు, న్యాయవాది విజయరావు, నాగేంద్రబాబు, షాహీన్, బాడిస భిక్షం, జానకీరామ్, రామకృష్ణ, సింగరేణి సేవా సమితి సభ్యులు నాజర్‌పాషా, కిరణ్, సిబ్బంది సుహాసిని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భానుమతి

వృద్ధులకు ఉచిత న్యాయసేవలు..

అశ్వాపురం : మండలంలోని సీతరాంపురం మానవీయ వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు తాము ఎల్లవేళలా కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి రమేష్‌బాబు, కమటం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దైదా నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి అసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూబెల్లికి సరికొత్త అందాలు

- పర్యాటకంలో అగ్రగామిగా నిలుపుదాం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇల్లెందురూరల్: సహజ సిద్ధమైన అందాలున్న పూబెల్లికి పర్యాటక హంగులతో సరికొత్త అందాలు వచ్చేలా చేద్దామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని పూబెల్లి గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించుకున్న ప్రణాళిక ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధనకు విభాగాల వారీగా కమిటీలు వేయాలని, ఆయా సభ్యులు వారం రోజులు శ్రమిస్తే పనులు పూర్తవుతాయని చెప్పారు. విడిది స్థలానికి వాహనాలు వెళ్లేలా గ్రావెల్ రోడ్డు సిద్ధం చేయాలని సూచించారు. చెరువులో బోటింగ్‌కు అవసరమైన లాంచీని సమకూర్చడంతో పాటు పర్యాటకులకు ఆదివాసీ సంప్రదాయ ఆహారం అందించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్ వరకు అందరూ ఈ పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, సెర్ప్ ఏపీఎం దుర్గారావు, సీసీ ఖమ్మంపాటి నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూబెల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆర్థిక పునరావాస పథకం ద్వారా దివ్యాంగులకు స్వయం ఉపాధి, పునరావాసం, కుటీర పరిశ్రమల స్థాపనకు సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 2 వరకు https: tgobmms. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బేటీ బచావో.. బేటీ పడావో పోస్టర్ల ఆవిష్కరణ..

కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ పథకం ఉపకరిస్తుందన్నారు. ఆడపిల్లలను రక్షించడంతో పాటు లింగ ఆధారిత అసమానతలను తొలగించేలా అందరూ కృషి చేయాలని కోరారు. బాలికల రక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, బాలల సంరక్షణ అధికారి హరికుమారి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ సంతోష్ రూప పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

అశ్వాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని ఆ శాఖ ఎస్ఈ మహేందర్ అన్నారు.చవిటిగూడెం, చింతిర్యాల క్రాస్ రోడ్డులో లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్ సరఫరాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఈ జీవన్‌కుమార్, ఏఈ ప్రసన్న కుమారి, సబ్ ఇంజనీర్ మణిదీప్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంటౌన్: జిల్లా పోలీసు అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఎస్పీ బి.రోహిత్‌రాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, కార్యాలయ ఏఓ మంజ్యానాయక్, ఆర్ఐలు కృష్ణారావు, నర్సింహారావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు, నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, జానీమియా పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

దసరా మండపంలో విలాసోత్సవం

రామాలయంలో 26న విశ్వరూప సేవ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి విలాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్త రామదాసు నిర్మించిన దసరా మండపంలో బుధవారం ఈ వేడుక నేత్రపర్వంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, మహిళా భక్తుల కోలాటాలు, భక్తుల శ్రీరామ నామ స్మరణల నడుమ పల్లకీ సేవగా తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేశాక స్వామివారికి హారతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వేడుకల్లో వైద్యులు ఎస్.ఎల్. కాంతారావు, బి. సుబ్బరాజు, రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా విలాసోత్సవాలు గురువారంతో ముగియనుండగా, 26వ తేదీన బేడా మండపంలో విశ్వరూప సేవ నిర్వహించనున్నారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం, నిత్య కల్యాణం జరిపించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాకు 26 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 26 మంది హాజరయ్యారు. మెడ్‌ప్లస్ (హైదరాబాద్)కు ఏడుగురు, శ్రీరామ్ చిట్స్‌ఫండ్స్‌కు ముగ్గురు ఎంపికయ్యారని ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

ఇళ్ల మంజూరులో అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న పీడీ శంకర్

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో హౌజింగ్ పీడీ శంకర్ బుధవారం పాండురంగాపురం గ్రామంలో విచారణ చేపట్టారు. మంగళవారం గ్రామంలో జరిగిన గ్రామసభలో మహిళలు అధికారులను దిగ్బంధం చేసిన విషయం విదితమే. దీంతో పీడీ ఇంటింటికీ తిరిగి విచారణ చేశారు.

మద్యం చోరీ చేసిన వ్యక్తులు అరెస్ట్

ములకలపల్లి: మండలంలోని రాజాపురం వైన్స్ షాప్‌లో చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. రాజాపురంలోని వైన్స్ షాప్‌లో గత డిసెంబర్ 21న చోరీ జరిగిన విషయం విదితమే. బుధవారం మంగపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మద్యం తరలిస్తున్న ఆటో, అందులో అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, విచారించగా తామే చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

సింగరేణిలో నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు

- పోలీసులకు జీఎం ఫిర్యాదు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేసే కొందరు పదోన్నతుల కోసం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే – 5 ఇంక్లైయిన్ ఖని నుంచి అండర్‌గ్రౌండ్ ఎక్స్‌పీరియెన్స్ సర్టిఫికెట్లు నకిలీవి తీసుకున్నట్లు గుర్తించామని ఏరియా జీఎం శాలేంరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. మైనింగ్ డిగ్రీ/డిప్లొమా సర్టిఫికెట్ హోల్డర్లు పదోన్నతుల కోసం అంతర్గత పరీక్షలు రాసే క్రమంలో కోసం పీవీకే – 5 గని మేనేజర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ స్టాంప్‌లతో సర్టిఫికెట్లు పొందారని వివరించారు. ఈ విషయంపై కొత్తగూడెం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. నకిలీ సర్టిఫికెట్లపై విచారణ చేపడుతున్నామని, అవి పొందిన వారి పరీక్ష ఫలితాలను హోల్డ్‌లో పెడతామని తెలిపారు. భవిష్యత్‌లో పరీక్షలకు అనర్హులుగా ప్రకటిస్తామన్నారు.

బీజేపీ నాయకుడికి తప్పిన ప్రమాదం

అశ్వాపురం: మండలంలోని బీజీకొత్తూరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పాడియం బాలరాజు కుమార్తెతో కలిసి బుధవారం కారులో హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్నాడు. ఖమ్మం సమీపంలో జాతీయ రహదారిపై పొగమంచు కారణంగా కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఇద్దరు సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇద్దరూ సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

13 మందిపై అట్రాసిటీ కేసు

పాల్వంచరూరల్: రెండు వర్గాల మధ్య తలెత్తిన వాగ్వాదం ఘర్షణకు దారితీసిన ఘటనలో పోలీసులు 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరులో ఈ నెల 19వ తేదీన బ్రిడ్జిపై అసోజు ప్రవీణ్ మరి కొంతమంది స్నేహితులతో కలిసి మాట్లాడుకుంటున్న సమయంలో ఆదేమార్గంలో వచ్చిన లక్ష్మీనారాయణ మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లక్ష్మీనారాయణ మరికొంమంది ప్రవీణ్, నరేందర్, విజయ్, నిఖిల్‌పై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించారని ప్రవీణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీరాములు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

ఇల్లందు : పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన రావుల సీతమ్మ(70) కాలిన గాయాలతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పక్షవాతంతో బాధ పడుతున్న సీతమ్మ మూడు రోజుల క్రితం ధూమపానం సేవిస్తూ ఉండగా ఒంటిపై నిప్పు రవ్వలు పడి బట్టలు అంటుకున్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంటలు వ్యాపించి శరీరం కాలిపోయింది. కాసేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు చూసి ఖమ్మం ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్ మీరా కేసు నమోదు చేశారు.

గౌరవ వేతనం ఎప్పుడిస్తారో?

- సర్వే ఎన్యుమరేటర్ల ఎదురుచూపులు
- రెండు నెలలైనా అందని పారితోషికం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు (ఫైల్)

చుంచుపల్లి: గతేడాది నవంబర్‌లో జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రభుత్వం చెల్లించాల్సిన గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించింది. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా ప్రజల నుంచి ఎన్యూమరేటర్లు ఎన్నో అవమానాలు, అష్టకష్టాలను ఎదుర్కొంటూ జిల్లాలో విజయవంతంగా ఆ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే పూర్తయి రెండు నెలలు దాటినా కానీ నేటి వరకు వీరికి గౌరవ వేతనం అందలేదు. దీంతో ఎప్పుడొస్తాయోనని ఆశగా నిరీక్షిస్తున్నారు. అటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచడంతో పాటు ఇటు ప్రభుత్వ పరంగా అమలు చేసే సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గతేడాది నవంబర్ 6 నుంచి 21 వరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ వార్డు అధికారులు, సెర్ప్ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా పనిచేశారు. సర్వే సందర్భంగా ఒక్కొక్కరూ 120 నుంచి 150 వరకు కుటుంబాల చొప్పున ఎంచుకొని సమగ్రంగా వివరాలు సేకరించారు. ఈ ఇంటింటి సర్వే అనంతరం నవంబర్ 22 నుంచి డిసెంబర్ 6 వరకు కుటుంబ వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ సమయంలో కొందరు సర్వేకు అందుబాటులో లేకపోవడంతో తిరిగి మరోసారి వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి వచ్చింది.

జిల్లాలో 3,36,407 కుటుంబాల సర్వే

జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 2,383 మంది ఎన్యూమరేటర్లతో పాటు పర్యవేక్షణ కోసం మరో 236 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్ 150 కుటుంబాల చొప్పున సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 103 వార్డులు, 481 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,36,407 కుటుంబాలకు చెందిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులతో పాటు కులం వివరాలను కూడా ఈ సందర్భంగా నమోదు చేసుకున్నారు. ఒక్కో కుటుంబానికి 8 పేజీలతో కూడిన సర్వే ఫామ్‌లో 75 రకాల ప్రశ్నలుండగా, ఆయా కుటుంబ సభ్యుల నుంచి ఎన్యూమరేటర్లు ఓపిగ్గా వివరాలను రాబట్టారు. నేరుగా కుటుంబాల వద్దకు వెళ్లి చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, కులం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, వయస్సు, పశు సంపద, దివ్యాంగులు, వైవాహిక స్థితి, చదువు, ఫోన్‌నంబర్, వృత్తి, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యాపారం, కార్మికులు, వార్షిక ఆదాయం, ఆదాయ పన్ను చెల్లింపు, పట్టా భూమి, కౌలురైతు వివరాలు, రిజర్వేషన్ల ద్వారా పొందిన విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, గత ఐదేళ్ల నుంచి పొందుతున్న ప్రభుత్వ పథకాలు వంటి వివరాలను సేకరించారు. జిల్లాలో ఈ ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. అయితే సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లకు రూ.10 వేల చొప్పున, సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పాటు కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కొక్క దరఖాస్తుకు రూ.7 చొప్పున ఇవ్వాల్సి ఉంది. జిల్లాలోని 3,36,407 కుటుంబాల డేటా ఎంట్రీ కోసం 1,753 మంది ఆపరేటర్లు పాల్గొన్నారు. వీరందరికీ కలిపి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.3.10 కోట్ల మేర గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి కాగానే చెల్లిస్తామని చెప్పి రెండు నెలలు దాటినా ఇంతవరకు విడుదల చేయకపోవడంతో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బడ్జెట్ రావాల్సి ఉంది



సమగ్ర కుటుంబ సర్వేలో భాగస్వాములైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రాగానే అందరికీ వారి ఖాతాల ద్వారా చెల్లిస్తాం.

– డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

ట్యాంకర్.. వస్తేనే వాటర్..

- ఊసిర్లగూడెం వాసులకు తాగునీటి తిప్పలు
- పది రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా
- ఇంటింటా ఖాళీ డ్రమ్ములతో పడిగాపులు



వాటర్ ట్యాంక్ ద్వారా అందిస్తున్న తాగునీరు

అశ్వారావుపేటరూరల్: వేసవి రాకముందే గిరిజన పల్లెల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఓ గ్రామంలో తాగునీటి కోసం కొద్ది రోజులుగా గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. రెండు, మూడు రోజులకు వచ్చే పంచాయతీ వాటర్ ట్యాంక్ కోసం పడిగాపులు కాస్తున్నారు. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊసిర్లగూడెం గ్రామంలో సుమారు 130 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామంలో తాగునీటి పథకంతోపాటు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారు. కాగా, పది రోజుల కిందట తాగునీటి పథకానికి సంబంధించిన మోటార్ దెబ్బతిన్నది. అలాగే మిషన్ భగీరథ నీళ్ల కుడా సరఫరా కాకపోవడంతో స్థానికులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పంచాయతీ కార్యదర్శి సబిత ఆధ్వర్యంలో మోటారును మరమ్మతులకు తరలించగా, బుధవారం నాటికి కూడా తిరిగి బిగించలేదని స్థానికులు చెప్పారు. దీంతో తామంతా రెండు మూడు రోజులకు వచ్చే పంచాయతీ వాటర్ ట్యాంకర్‌పైనే ఆధార పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ ఏ సమయంలో వస్తుందో తెలియక ప్రతి ఇంటి ముందు ఖాళీ డ్రమ్ములను పెట్టి, కూలీ పనులకు వెళ్తున్నట్లు వారంతా వాపోతున్నారు. దీనిపై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈఈ రమేశ్‌ను వివరణ కోరగా.. మోటార్ దెబ్బతిన్నదని తెలిసిందని, మిషన్ భగీరథ నీళ్ల నిలిచిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. సమస్య తెలుసుకొని మిషన్ భగీరథ నీటి సామర్థ్యాన్ని పెంచి సరఫరా చేస్తామని తెలిపారు.

వన్యప్రాణులకు హాని చేస్తే చర్యలు



సీసీ కెమెరాకు చిక్కిన గుర్తు తెలియని వ్యక్తులు

కరకగూడెం: వన్య ప్రాణులకు ఎవరైనా హానీ కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు ఫారెస్ట్ డివిజన్ అధికారి మక్సూద్‌మోహినుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల పెద్దపులి సంచారంతో కరకగూడెం మండలంలోని అటవీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వన్య ప్రాణులను వేటాడానికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అడవుల్లో సంచరిస్తుండగా సీసీ కెమెరాలో నమోదైనట్లు వివరించారు. సదరు వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నామని, వేటగాళ్లు తమ ప్రయత్నాలను మానుకోకపోతే వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ఎఫ్‌డీఓ హెచ్చరించారు.

ఉత్తమ సేవలు అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ట్రాయ్ కాగ్ సభ్యుడు ప్రభాకర్‌రావు

మణుగూరురూరల్: వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే భారత టెలికాం ప్రాధికార సంస్థ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించగా ప్రభాకర్‌రావు మాట్లాడారు. టెలికాం వినియోగదారుల హక్కుల కోసం భారత టెలికాం ప్రాధికార సంస్థ 1997లో ట్రాయ్ సీఏజీ యాక్ట్ తీసుకొచ్చారని, టెలికాం రంగంలో ప్రపంచంలోనే భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. మొబైళ్లలో 2006 నుంచి పోర్టబిలిటీ అవకాశాన్ని కల్పించిందని, 2025 నాటికి దేశవ్యాప్తంగా 7 లక్షల గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారులకు ఏవిధమైన లోపాలు వచ్చినా ఎవరికి ఫిర్యాదు చేయాలో, అవసరమైన వ్యాపార ప్రకటనలకు అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు వీణ, సాంబమూర్తి, భాస్కర్, నవీన్, అంకిత్‌కుమార్(బీఎస్ఎన్ఎల్), ప్రసాద్ (ఎయిర్‌టెల్ ఎఫ్ఎస్ఈ), ఇస్మాయిల్ పాషా (బీఎస్‌పీ/టీటీఏ), ప్రవీణ్ కుమార్ (బీఎస్ఎన్ఎల్), రమేశ్ (బీఎస్ఎన్ఎల్), సైదులు (బీఎస్ఎన్ఎల్), రవితేజ (జియో), జానీమియా (బీఎస్ఎన్ఎల్ జేఈ), రామిరెడ్డి (బీఎస్ఎన్ఎల్) పాల్గొన్నారు.

శంకుస్థాపన దిమ్మె ధ్వంసం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం జీపీ భవన శంకుస్థాపన దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు 2023 జూన్ 17న శంకుస్థాపన చేయగా పూర్తయ్యాక ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. ఆ మేరకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేయగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా, మాజీ సర్పంచ్ సోమాని శివశంకర వరప్రసాద్, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇన్‌చార్జి కార్యదర్శి జగదీశ్ తిరిగి శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమనిగింది.

రూ.8 కోట్లకు టోకరా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి చిట్టీల పేరుతో రూ.8 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కూలీలైన్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి చిట్టీల పేరుతో తమను మోసం చేశాడని 150 మంది వరకు ఆయన ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఎలాంటి స్పందన రాకపోవడంతో అనంతరం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు వెల్లడించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



రమేశ్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఈసం రమేశ్ (28) పురుగుల మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ప్రైవేట్ ఫైనాన్స్‌లో రుణం పొంది వాహనం కొనుగోలు చేసిన రమేశ్ కిస్తీలు సరైన సమయంలో చెల్లించలేకపోయాడు. ఫైనాన్స్ బాధ్యుల నుంచి వేధింపులు ఎక్కువ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల ముందు తాగాడని, మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు ఫైనాన్స్ వారి వేధింపులే కారణమని వారు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లచ్చాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మక్కెళ్ల శివ (32) ఆటో నడుపుతూ జీనవం సాగిస్తున్నాడు. కొంతకాలం కిందట కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిన అతడి భార్య తిరిగి రాలేదు. మనస్తాపం చెందిన శివ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బుచ్చిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీట్ ఆఫీసర్ మృతి

మణుగూరుటౌన్: ద్విచక్రవాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బీటీపీఎస్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు ఆదర్శనగర్‌కి చెందిన ఓ డ్రైవర్ మద్యం సేవించి డీసీఎం నడుపుకుంటూ మణుగూరు వైపు వస్తుండగా, బీటీపీఎస్ సమీపంలో మణుగూరుకు మోటార్‌సైకిల్‌పై వస్తున్న బయ్యారం రేంజ్ బోటిగూడెం బీట్ ఆఫీసర్ సాంబశివరావు(45)ను వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో 100 పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిసింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఇందులో విద్యార్థులు కీలకంగా వ్యవహరించాలి
- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

భద్రాచలం: విద్యార్థులు చదువుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ ఇంకొందరికి అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యాన ఎంపిక చేసిన 50 పాఠశాలల విద్యార్థులకు బుధవారం సబ్బులు, ఇతర ద్రవాల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పీఓ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తిస్తే ఫలితాలు వస్తాయని తెలిపారు. పర్యావరణానికి హానీ చేయని అంశాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. పాఠశాల, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ దిశగా ఉపాధ్యాయులు సైతం అవగాహన కల్పించాలని పీఓ సూచించారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి సరస్వతి చలపతిరాజు ఎన్‌జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్) ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఎన్‌జీసీ ఏసీఓ రాజశేఖర్ సబ్బులు, హ్యాండ్ వాష్, డిష్ వాష్ ద్రావణాల తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు టీ షర్ట్స్, టోపీలు, నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీరానాయక్, ఎంఈఓ టి.రమ, ఏసీఎంఓ రమణయ్య, ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఐటీసీలో బీఆర్‌టీయూ మిత్రపక్షాలదే విజయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ మిత్రపక్షాల విజయం తథ్యమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సారపాకలో బీఆర్‌టీయూ మిత్రపక్షాల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, ప్రచార రథాలను ప్రారంభించారు. 14వ వేతన ఒప్పందం కోసం 14 అంశాలతో బీఆర్‌టీయూ మిత్రపక్షాల మేనిఫెస్టో విడుదల చేసిందని, గత గుర్తింపు సంఘాలు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించి తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు. బీఆర్‌టీయూకు అనుభవం లేదని ప్రచారం చేస్తున్న టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీలు తమ అనుభవంతో కార్మికులకు ఏం ఒరగబెట్టాయని ప్రశ్నించారు. ఎన్నికలలో బీఆర్‌టీయూను గెలిపిస్తే ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి కార్మికులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, సీఐటీయూ అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మల్లికంటి వెంకటేశ్వర్లు, ఐఈయూ ప్రధాన కార్యదర్శి ఎండీ సాబీర్, వలి, నర్సింహారావు, మధుమహరాజ్, శ్రీపాద రవికుమార్, గద్దల నాగేశ్వరరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, కొనకంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలను ఏరియా జీఎం ఎం.శాలేంరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ అవసరమని, విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. మణుగూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ మాట్లాడుతూ.. క్రీడలతో నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, లక్ష్యసాధన వంటివి అలవడుతాయని చెప్పారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ మాట్లాడగా.. వాలీబాల్, ఖో–ఖో పోటీలు జరిగాయి. క్రీడల్లో కొత్తగూడెం, మధిర, మణుగూరు, డీఏఆర్ఈ, ఎస్‌బీఐటీ ఖమ్మం, సత్తుపల్లి, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కొండగొర్రె మాంసం కొనుగోలుదారుల రిమాండ్



నిందితులను జైలుకు తరలిస్తున్న అటవీ అధికారులు

మణుగూరురూరల్: అడవి జంతువు మాంసం కొనుగోలు చేసిన కేసులో ఇద్దరికి మణుగూరు కోర్టు రిమాండ్ విధించిందని ఎఫ్‌ఆర్ఓ ఉపేందర్ బుధవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన మండలంలోని కూనవరం రైల్వే గేట్ సమీపాన దీపక్ కూల్ డ్రింక్స్ దుకాణంలో తనిఖీ చేయగా రెండు కేజీల కొండగొర్రె మాంసం లభ్యమైంది. బుగ్గ గ్రామానికి చెందిన వజ్జా సారయ్య అడవి జంతువును చంపగా బోశెట్టి కౌసల్య మాంసాన్ని కొనుగోలు చేసినట్లు తేలడంతో ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కె.సూరిరెడ్డి 14 రోజుల రిమాండ్ విధించారని ఎఫ్‌ఆర్ఓ ఉపేందర్ వెల్లడించారు. అడవి జంతువులను వేటాడడం, మాంసం క్రయవిక్రయాలు నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

భద్రాచలంఅర్బన్: అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు నుంచి ఓ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం దుమ్ముగూడెంనకు తరలిస్తుండగా పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి పట్టుకున్నారు. కిలో రేషన్ బియ్యాన్ని రూ.6కి కొనుగోలు చేసి దుమ్ముగూడెంలో ఉన్న వలస కూలీలకు రూ.15కు విక్రయించేందుకు ఓ ఆటోలో 2.5 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన ఆటో, బియ్యాన్ని స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించి, తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.